# లక్కీగర్ల్

**ఆంధ్రభూమి, 21 నవంబరు 98**




పదహారు కొవ్వొత్తులు ఆర్పి కేక్ కట్ చేసింది. శృతి.

"హేపీ బర్త్‌డే టు శృతీ!" అన్న అరుపులూ కేరింతలతో చప్పట్లతో ఇల్లంతా హోరెత్తి పోయింది.

వంటింట్లో వుండి ఏర్పాట్లన్నీ చూస్తోంది రోహిణి. విపరీతమైన అలసటగా ఉంది. పొద్దున్న ఆరింటినుంచి నిర్విరామంగా చేస్తున్నా పని తెమలడంలేదు. అసలే ఫంక్షన్‌కి పెద్ద గొడవైంది. ఫ్రెండ్స్‌కి డిన్నరిస్తానంది శృతి. వంట మనిషి దొరలేదు. అశోకాలో పార్టీ ఇస్తానంది. దానికి మూర్తి ఒప్పుకోలేదు. హోటల్లో బర్త్‌డే పార్టీలు చేసుకునేంత గొప్పవాళ్ళం కాదు మనం అని కోప్పడ్డాడు. పిల్లల్ని హద్దుల్లో పెంచడంలేదని తననీ కోప్పడ్డాడు. తనకి మాత్రం ఇవన్నీ ఇష్టమా? కూతురు చిన్నబుచ్చుకుంటుందని సరేననడం తప్పిస్తే?

రోజూ రానూపోనూ నలభై కిలోమీటర్లు ప్రయాణం చేసి జాబ్ చేస్తోంది రోహిణి. నాలుగంచెల ప్రయాణం. ఇంటి నుంచి స్టేషన్‌దాకా ఆటో. తర్వాత అరగంట రైలు. ఆపైన బస్సు. ఆఖర్లో ఒక కిలోమీటరు నడక. ఇంక ఈ సరదాలకి వోపికెక్కడిది? చెప్తే అర్థంచేసుకోదు కూతురు. ఏదో తక్కువైందని బాధపడుతుంది. ఆ పిల్ల అడిగినదేదేనా కాదంటే తనని నిర్లక్ష్యం చేస్తున్నట్టు ఫీలవుతుంది. డిన్నరు లేదన్నందుకు రెండు స్వీట్లు, మిక్చరు, కేకు, ఐస్క్రీమ్ ఉండాలని పట్టుపట్టింది. కొన్ని కొనేసి తెచ్చినా మరి కొన్ని ఇంట్లో చేయాల్సి వచ్చి చచ్చే చావైంది రోహిణికి.

చిన్నగా నిట్టూర్చి ట్రేలలో అన్నీ సర్దింది. శృతి లోపలికి వచ్చి ఒక్కొక్కటీ తీసుకువెళ్ళింది. ఆ పిల్ల ఆఖరిసారి వెడుతుంటే చెప్పింది. "ఫ్రిజ్‌లో ఐస్క్రీముంది. చివరగా ఇవ్వు" అని. విందోలేదో గానీ వూ అని కూడా అనకుండా వెళ్ళిపోయింది. చివుక్కుమంది రోహిణికి. ఏం పిల్లో తల్లి కష్టంసుఖం అరర్థం చేసుకోకుండా పెరుగుతోంది! నిరసనగా అనుకుని వంటింటి తలుపులు దగ్గరికి వేసి వెళ్ళి బెడ్రూంలో మంచంమీద వొరిగింది.

హాల్లోంచీ కూతురు, ఫ్రెండ్స్ మాట్లాడుకుంటున్న మాటలు వినిపిస్తున్నాయి. అంతా సినిమాల గురించీ, హీరో హీరోయిన్ల గురించీ, లేటెస్టు ఫాషన్ల గురించీ... ఇంకో టాపిక్కేలేనట్టు గోల గోలగా మాట్లాడుకుంటున్నారు. అదయ్యాక అంత్యాక్షరి... విని విని విసుగు పుట్టింది రోహిణికి. కొంతసేపలా గొడవగొడవగా మాట్లాడుకున్నాక హటాత్తుగా మాటలైపోయినట్టు ఆగిపోయారందరూ తుపాను వెలిసినట్టు అనిపించింది రోహిణికి. కొద్దిసేపయ్యాక కూతురు గొంతు వినిపించింది.

'లక్కీ గర్ల్ గేమాడదామా?'

ఎలా ఎలా? మిగిలినవాళ్ళు కుతూహలంగా అడిగారు. రోహిణికి కూడా కుతూహలం

కలిగింది. వాళ్ళ మాటల్ని వినసాగింది.'ఏం లేదు. అందరం తలో చిన్న స్లిప్ తీసుకుని మనలో ఎవరు లక్కీ అనిపిస్తారో వాళ్ళ పేరు సీక్రెట్‌గా రాయాలి. ఎవరి పేరు ఎక్కువ మంది అనుకుంటారో వాళ్ళేగేమ్‌లో విన్ అయినట్టు. మా డేడీ ఫ్రెండింట్లో ఫంక్షన్‌కి ఇదే గేమ్ ఆడారు. బట్.. వన్ కండిషన్.. హిపోక్రిసీ ఉండకూడదు.''

'ఆంటీ ఎక్కడ? ఆంటీని జడ్జిగా పెడదాం.'

శృతి వచ్చి రోహిణిని తీసుకువెళ్ళింది. గేమ్ మొదలైంది. అందరూ తలొక స్లిప్ తీసుకుని తమకి నచ్చిన పేరు రాసి రోహిణి ముందు పెట్టారు. ఆమె వాటిని చూసింది. మొత్తం ఎనిమిది మంది అమ్మాయిలు కూతుర్తో కలిసి. ముగ్గురు నమ్రత పేరు రాస్తే నమ్రత యింకొకరిపేరు రాసినట్టు గ్రహించింది. మిగిలి నలుగుర్లో నిఖిల పేరు ఇద్దరు, రజనీ పేరు ఒకరు, శృతి పేరు ఒకరు రాసారు.

వాళ్ల మనసుల్లో ఏముందో తెలుసుకోవాలనిపించింది రోహిణికి. అడిగితే ప్లెయిన్‌గా చెప్పేసారు.

'నమ్రత నిజంగా లక్కీ గర్ల్ ఆంటీ. వాళ్ల మమ్మీ హౌజ్‌వైఫ్. ఎప్పుడూ ఇంట్లోనే వుంటుంది. సాయంత్రాలు, సెలవురోజులు హాయిగా గడపుతారు వాళ్ళింట్లో'.. 'శిరీష చెప్పింది.

'అమ్మలు జాబ్ చెయ్యకూడదాంటీ' అంటూ కరుణ మొదలుపెట్టింది. స్కూల్లో ఉండగా మెచ్యూరైందట ఆ అమ్మాయి. టీచర్ చూసి ఇంటికి పంపేసిందట. కరుణ తల్లిది ఎగ్జిక్యూటివ్ జాబ్. ఆ అమ్మాయి ఇంటికిచ్చేసిరికి తల్లిలేదు. ఒకవైపు భయం, మరొకవైపు కంగారు.. తండ్రికి ఫోన్ చేస్తే ఆయనొచ్చాడట కానీ ఆ పిల్లకి ఎలా చెప్పాలో ఏం చెయ్యాలో ఆయనకితోచక చివరికి పక్కింటి మామ్మగారిని పిల్చుకొచ్చాడట. 'అబ్బా హారిబుల్ ఆంటీ!' అంది.

స్వప్నది మరో రకం సమస్య. తల్లిదండ్రులిద్దరూ చెరోచోట ఉద్యోగం చేస్తారు. ఇద్దరినీ టూరింగ్ జాబ్స్. అందుకుని కూతుర్ని హాస్టల్లోవేసారు. ''శృతికి వున్న ప్రివిలేజెస్ కూడా నాకు లేవాంటీ ఎంతరాత్రేనా కానివ్వండి. తనకి మమ్మీ డాడీలున్నారన్న ధీమా ఉంటుంది. తనకో తమ్ముడున్నాడు. కానీ నాకు పగలూ రాత్రి వంటరితనమే. నాకే చిన్న ప్రాబ్లమ్ వచ్చినా మమ్మీయో డాడీయో గుర్తొచ్చి అప్సెటౌతాను'' అంటుంటే ఆమె కళ్లల్లో పల్చటి నీటిపొర కదిలింది.

వీళ్లందరికన్నా ఎక్కువ ఫిర్యాదులున్నాయి శృతికి తల్లిదండ్రులపట్ల. ముఖ్యంగా తల్లిపట్ల. తనకి జ్వరంగా వున్నా, ప్రొబేషన్ పీరియడ్లో లీవు పెట్టకూడదని అలాగే వదిలిపెట్టి ఆమె ఆఫీసుకి వెళ్ళిపోవడం.

తమ్ముడు సైకిల్ మీదినుంచి పడి దెబ్బ తగుల్చుకున్నప్పుడు తనని స్కూలుకెళ్లవద్దని వాడిని తనకొదిలిపెట్టి ఆమె ఇన్స్‌పెక్షన్ వుందని వెళ్లిపోవడం - కనీసం తమ బర్త్‌డేలని సెలబ్రేట్‌చేసే తీరిక కూడా ఆమెకి లేకపోవడం.

పండగల్లో ఆమె ఉదాశీనత - ఇలా చాలావున్నాయి. కానీ నోరుతెరిచి ఏమీ చెప్పలేదు. మొత్తం మీద పిల్లలెవరికీ తల్లి ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదనే రోహిణికి అర్థమైంది. ఏమీ పైకి వ్యక్తపరచని కూతురి మనసుతో సహా. లక్కీగర్ల్ నమ్రత నవ్వుతూకూర్చుంది. వాళ్ల బాగా ఆస్తిపరులు. అందుకే ఆ పిల్ల తల్లి ఉద్యోగం చెయ్యడం లేదేమో. లేక మరే కారణాలున్నాయో? అవన్నీ చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో లేదు మిగతావాళ్లు.

కొత్తది హెయిర్ క్లిప్పుంటే నమ్రతకి ప్రెజెంట్ చేసింది. ఇంకొద్దిసేపు వుండి అంతా వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లగానే శృతి బద్ధకంగా ఆవులిస్తూ 'మమ్మీ బాగా టైర్డైపోయాను గుడనైట్

అనేసి బట్టలేనా మార్చుకోకుండా తన గదిలోకి వెళ్లిపోయింది.

గదంతా చిందరవందరగా అలాగే వదిలేసి తప్పుకున్న ఆమె బాధ్యతా రాహిత్యానికి చాలా కోపం వచ్చింది రోహిణికి. ఏదైనా అంటే మాటకి మాట ఎదురు చెప్తోంది. తనూ గట్టిగా మందలించలేకపోతోంది మొదటినుంచీ కూడా. ఏదోగిల్టీ పీలింగ్. దాన్ని జయించలేక కూతురి మొండితనానికి లొంగిపోతోంది.

గది సర్దేసి మూర్తికోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

★★★

మూర్తి ఇంటికొచ్చేసరికి బాగా లేటైంది. "పార్టీ బాగా జరిగిందా? శృతేది? హేపీయా అది?" - వస్తూనే అడిగాడు.

అన్నిటికీ కలిపి ఒక్కటే జవాబుగా వూ అని వూరుకుంది రోహిణి.

'ఏమైంది? మళ్లీ ఏదైనా గొడవా?' అడిగాడు.

'తింటూ మాట్లాడకుందాం రండి?' వంటింట్లోకి దారి తీస్తూ చెప్పింది. పిల్లల ఫీలింగ్స్ గురించి చెప్పింది. 'మిగిలిన ఫ్రెండ్స్‌తో పోలిస్తే మన శృతి పరిస్థితే నయం. ఒకమ్మాయి తండ్రి డ్రంకర్డ్. మరో అమ్మాయి తల్లేమో ఇంటి పనంతా కూతురి మీద వదిలేస్తుందట. అందరికీ ఏవో ఒక ప్రాబ్లమ్స్. మనం శృతి గురించి ఎంత కేర్ తీసుకుంటున్నాం? అంది హర్టవుతుందేమోనని ప్రతీదీ చూసుకుంటున్నాను. ఐనా దానికింకా ఏదో తక్కువైందనే ఫీలింగ్ - అంది.

మూర్తి సుదీర్ఘంగా విశ్వసించాడు. 'కమ్యూనికేషన్ గాప్ రోహిణి. ఇది వరకు తల్లీ పిల్లలకి మధ్య మంచి అవగాహన వుండేది. ఒకళ్ల అంతరంగంతో మరొకరికి ఇంటరాక్షన్ వుండేది. ఇప్పుడు తల్లులు ఉద్యోగాలనీ పిల్లలు చదువులనీ దూరమవుతున్నారు' అన్నాడు.

'మరి పరిష్కారమేమిటి? ఇదిలాగే ఆలోచిస్తూ పోతే నావట్ల ద్వేషం పెంచుకుంటేందేమోనని భయమేస్తోంది?' అంది.

అప్పటికి ఇద్దరి భోజనం పూర్తయింది. ఇద్దరూ బాల్కనీలోకి వచ్చారు.

'నీకోవారం రోజులు లీవుపెట్టడానికి కుదుర్తుందా?' అడిగాడు మూర్తి. 'దానికో చిన్న షాక్ ట్రీట్‌మెంటివ్వాలి. అన్నీ అమర్చిపెడుతూ వుంటే ఆ అమరిక వెనక మన తపననీ, ఆర్తినీ అర్థం చేసుకోలేకపోవడమంత బేడ్‌రిసెప్షన్ మరోటి వుండదు. రేప్పొద్దున్న పెద్ద జాబ్‌చేసినా, పెళ్ళి చేసుకున్నా కూడా ఇలాగే వుటుంది ఇప్పుడు సరిచెయ్యకపోతే'.

'అదే కద నా బాధ కూడా' అని 'ఈవాళ ఎలాగా లీవే కదా అదే కంటిన్యూ చేస్తాను' అంది రోహిణి.

★★★

మర్నాడు రోటీన్‌కి భిన్నంగా తెల్లవారడం శృతికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తను లేచేసరికి వంట పూర్తి చేసి దాదాపుగా తయారైపోయి వుండేది తల్లి. అలాంటిది ఆమె ఇంకా వంట మొదలుపెట్టడకపోవడంతో 'మమ్మీ ఈ రోజు లీవా?' అనడిగింది.

కూతురి ముఖంలోకి నిశితంగా చూసింది రోహిణి. చూసి చిన్నగా నవ్వుతూ 'జాబ్ రిజైన్ చేసాను. ఈ వేళే కాదు. ఎప్పటికీ వెళ్లక్కర్లేదు' అంది.

'మమ్మీ!' అపనమ్మకంగా అంది శృతి.

"నిన్న మీ ఫ్రెండ్సంతా డిసైడ్ చేసారుగా. అమ్మలు జాబ్ చెయ్యడం బావోదని. అందుకని రిజైన్ చేసాను. టుమేక్ యు లక్కీ." 'ఓహ్!' పెద్దసంతోషపు కెరటం .... ముంచెత్తింది శృతిని.

తూనీగలా గెంతింది. కొడుకు కూడా "నిజమా మమ్మీ నేనివాళ స్కూల్నించి వచ్చేసరికి ఇంట్లో ఉంటావా?" అని నమ్మలేనట్టుగా అడిగి నిజేమనని తెలిశాక హుషారుగా వెళ్ళాడు.

'ఈవేళ ఇంపార్టెంట్ క్లాసులున్నాయి. కాలేజీకి వెళ్లక తప్పదు మమ్మీ! సాయంత్రం పిక్చర్కెళ్దాం' తల్లికి చెప్పేసి వెళ్లిపోయింది శృతి. సాయంత్రం అంతా కలిసి పిక్చర్కెళ్లారు. మర్నాడు తల్లితో కలిసి షాపింగ్.. నాలుగు రోజులు గిర్రుమని తిరిగిపోయాయి.

పిల్లలు తనెంత మిస్సవుతున్నారో అనుకుని బాధపడింది రోహిణి. కానీ ఉద్యోగం చెయ్యక తప్పని పరిస్థితి. ఏవో ఆదర్శాలకోసమో హక్కులకోసమో కాదు, తను ఉద్యోగం చేసేది. కుటుంబస్థాయి పెరిగి, పిల్లలు పైకి రావాలని. ఒకప్పుడు బాగా చదువుకున్న కుటుంబాల్లో స్త్రీలు అక్కడక్కడ ఉద్యోగం చేస్తూ కనిపించేవారు. వాళ్ల సొసైటీ వేరే ఉండేది. మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరో ఒకరిద్దరు ఉద్యోగం చేసినా వాళ్లని తక్కువగా చూసేవారు. ఇప్పుడు అందరికీ తప్పనిసరైపోయింది. ఇద్దరు తెచ్చుకున్నా కుటుంబం నడవని పరిస్థితి. ప్రాథమిక అవసరాలైన తిండి, బట్టా, గూడూ, చదువు, వైద్యం అన్నీ లగ్జరీసైపోయి మామూలు వాళ్లకి బతుకు పెద్ద సవాలైపోయింది. ఈ రోజు ఆడవాళ్ళు ఉద్యోగం చేయడం అనివార్యమైంది. రేపటిరోజున చైల్డ్ లేబర్ కూడా లీగలైజ్ చేస్తారేమో! అనుకుంది. రోహిణి.

★★★

'డేడీ' - శృతి పిలుపుకి మూర్తి న్యూస్ పేపర్లోంచి తలెత్తాడు. ఫీజెప్పుడు కడ్తారు?' అమాయకంగా అడిగింది. ఆమె కళ్లలో కోటి కలలు కదలాడాయి. ఒక్క క్షణం కూతురికేసి చూసి, చూపులు మరల్చుకున్నాడు మూర్తి. ఆ పిల్లపట్ల తాము మరీ కఠినంగా వ్యవహరిస్తున్నామా? అంతలోనే సర్దుకున్నాడు.

'మమ్మీ నీకేం చెప్పలేదా?' అడిగాడు..

'మమ్మీయా? ఏం చెప్పలేదే? ఫీజు మమ్మీ కడుతుందా? ఐతే తననే అడుగుతాను' వెనుతిరగబోయింది.

'మమ్మీకిప్పుడు ఉద్యోగంలేదు, నెలకి రెండు వేలు ఏం పెట్టి కడుతుంది?' సూటిగా అడిగాడు మూర్తి. ఆ వెంటనే 'మమ్మీయేకాదు, నా ఒక్కడి జీతంలోంచి నేనూ కట్టలేను. నీ అంతట నువ్వు చదువుకుని, రేంకు తెచ్చుకుంటే అప్పుడాలోచిద్దాం' చెప్పేసి మరో మాటకి ఆస్కారమ్వికుండా మళ్లీపేపర్లో తల దూర్చాడు.

తల్లిని వెళ్లి అడిగింది శృతి!

"డాడీకొచ్చే ఆరువేలలో రెండు వేలు నీ ఫీజులే కట్టేస్తే ఇంక ఇల్లెలా గడుస్తుంది?" అంది రోహిణి మరో ఆలోచనకి చోటులేనట్టు.

శృతి కలలన్నీ చెదిరిపోయాయి. కళ్లల్లో నీళ్ళు నిలిచాయి. సాయంత్రం మూర్తీ రోహిణీ బయటికెళ్తూ శృతిని కూడా తీసుకువెళ్ళారు. మూడు గదుల ఇల్లు చూసి అద్దె మాట్లాడుకుని వచ్చారు.

'ఎవరికి మమ్మీ?' దార్లో అడిగింది శృతి.

'మనకే'

'ఎందుకు?'

'ఇంటికెళ్లాక చెప్తాను'

ఇంటికి చేరేలోగా వాళ్ల మాటల్లోనే అంతా అర్థమైంది శృతికి, ప్రత్యేకించి ఏమీ చెప్పకుండానే. తాముండే ఇల్లు లోన్ తీసుకుని కట్టుకున్నారు. నెలకి రెండువేలు రికవరీ

వస్తుంది తండ్రికి. ఆపైన కొన్ని ప్రైవేట్ లోన్లున్నాయి. తల్లి జాబ్ మానేసింది కాబట్టి ఇల్లమ్మేసి అవన్నీ తీర్చి ప్రశాంతంగా వుందామనుకుంటున్నారు. ఆ పిల్లలో చిన్న కదలిక.

ఉదయం తండ్రి ఫీజు కట్టలేనని చెప్పినపుడు తన కలలన్నీ చెదిరిపోయాయనిపించింది. మరిప్పుడు? తల్లి తీసుకున్న నిర్ణయంవల్ల తమందరి జీవితాలూ తలకిందులవబోతున్నాయా? అంటే తల్లి ఉద్యోగం తప్ప తమ కుటుంబానికి వేరే ఆస్తులేం లేవా? చిన్నప్పటి విషయాలు గుర్తు చేసుకోవాలని ప్రయత్నించింది.

మెళ్లో చిన్న గొలుసు మాత్రమే వున్న మామ్మ, బోసిమెడతో తిరిగే అమ్మమ్మా గుర్తొచ్చారు. రెండు కుటుంబాలకీ మూలస్తంభాలే అలా వుంటే తమ కింక వేరే ఆస్తులెక్కడినుంచి వస్తాయి? తన ఫ్రెండ్స్ సర్కిల్లో పోల్చుకుంటే కూడా తమదే తక్కువ స్థాయి. నమ్రత తల్లికి ఉన్నన్ని నగలుగానీ కరుణ తల్లికట్టేంత కాస్ట్లీ చీరలుగానీ తల్లికి లేవు. స్వప్న వాళ్లింట్లోవున్న ఫర్నీచర్లో పదోవంతు కూడా తమకి లేదు. ఉన్న ఇల్లు కూడా అమ్మేస్తే...

తల్లింత గట్టిగా ఎందుకు నిర్ణయించుకుంది? తనకోసమేనా? కేవలం తనని సంతోషపెట్టడానికేనా? ఇందులో ఎవరి సంతోషమూ వుండదని తనకంటే తెలీదుగానీ ఆవిడక్కూడా తెలీదా? తనకి బోధపరచవచ్చు. వినకపోతే మందలించవచ్చు. అక్కడే ఆగిపోయాయి. శృతి ఆలోచనలు. తనలాంటి అవకాశం ఇచ్చిందా? ఎంతోసేపూ అలగడం, సూటిపోటి మాటలనడం...

ఇల్లు చేరాక తల్లిదండ్రుల్తో మాట్లాడలేకపోయింది శృతి. తమ్ముడు ఎదురొచ్చాడు. వాడిని చూస్తుంటే అపరాధ భావన కలిగింది. వాడి భవిష్యత్తుని కూడా తనే పాడుచేసిందన్న ఆలోచన.

ఇంటికి వెళ్తూనే ఆకలి లేదని పడుకుంది. రోహిణి బెంగగా చూస్తే మూర్తి ఫరవాలేదన్నట్టు తలూపాడు.

మర్నాడు మూర్తి మరో బాంబు పేల్చాడు.

'మా కొలీగ్ ప్రసాదరావు తెలుసా రోహిణీ నీకు? కొడుక్కు పెళ్లి చేస్తాడట. సంబంధాలు చూస్తున్నాడు. మన శృతిని అడిగితే ఎలా వుంటుంది?"

అక్కడే వుండి ఏదో చదువుకుంటున్న శృతి దిగ్గునలేచింది. తండ్రి ప్రతిపాదన షాకింగా అనిపించింది. తల్లి ఏమంటుందోనని ఆందోళనగా చూసింది.

'అబ్బాయేం చేస్తున్నాడు?'

ఇప్పుడే పెళ్లేమిటని తిరస్కరిస్తుందని ఆశించిన శృతి నిలువునా నీరైపోయింది, రోహిణి కుతూహలం చూపించడంతో.

'కోర్టులో క్లర్కు' మూర్తి జవాబు.

'ఏం చదివాడు?'

'బియ్యే'

శృతి అక్కడినుంచి లేచి వెళ్లిపోయింది. దిండులో తలదూర్చి ఎంతసేపు ఏడ్చిందో? చల్లటి చెయ్యి భుజంమీద పడడంతో తలెత్తింది. చూస్తే తల్లి. ఆమె వళ్లో పడి ఏడ్చేసింది.

'మూడు నెలల పిల్లల్ని నిన్ను, తమ్ముడ్నీ ఇంట్లో వదిలేసి ఆఫీసుకి వెళ్లి నేనూ ఇలాగే ఏడ్చేదాన్ని శృతీ! మీకు జ్వరాలు, అనారోగ్యాలు వచ్చినా కూడా నేను ఆఫీసుకెళ్లడం ఒక్కోసారి తప్పనిసరయ్యేది. నాది క్లరికల్ జాబమ్మా! పై వాళ్లకీ కింది వాళ్లకీ కూడా లోకువైన ఉద్యోగం. మీకు వంట్లో బాగాలేదని లీవడితేమీరుండి ఏం చేస్తారని అడిగే ఆఫీసర్లుంటారు."

'....'

'మనది మిడిల్‌క్లాస్ ఫామిలీ. ఆస్తిపాస్తులంటూ ఏమీలేవు. నాన్న నెల నెలా పంపే రెండు వందల కోసం తాతయ్యా, నేను పంపే వంద కోసం అమ్మమ్మా ఆత్రంగా ఎదురు చూస్తుంటారు. అలాంటి కుటుంబాల్లోంచీ వచ్చిన మేము మీకేమంత మంచి భవిష్యత్తు ఇవ్వగలమని నేను ఉద్యోగం చెయ్యకుండా తిని కూర్చోను?'

'మమ్మీ' అప్పటికి పెదవి విప్పింది శృతి.

'స్ట్రగుల్ ఫర్ కో ఎగ్జిస్టెన్స్ శృతీ! తిండీ, బట్టా, నీరూ, నీడా ఇవన్నీ అందరికీ కావాలి. వున్న వాళ్ళకి అన్నీ అనాయాసంగా అమరుతున్నాయి. లేనివాడికి కూడా ఇవన్నీ కావాలి. మనకి ఫ్రీడం వచ్చినప్పుడు మన రూపాయి విలువ ఇంచుమించుగా అమెరికా డాలరంత వుండేది ఇప్పుడు? డాలర్‌కి నలభై రూపాయలు చెల్లిస్తున్నాం. బతుకుపోరాటంలోనే ఆడవాళ్ళు కూడా ఉద్యోగాల్లో అడుగుపెట్టారు."

'.....'

'నీకు మేమేం తక్కువ చెయ్యడంలేదు. మాలా నువ్వు ప్రతి వాడికీ తలొంచుకునే జాబ్ చెయ్యకూడదనే కోరికతో... కాదూ నువ్వు జాబ్ చెయ్యనంటే కనీసం పెద్ద ఉద్యోగస్తుడిని నీకు భర్తగా తీసుకురావాలనే ఆశతో... నేను జాబ్ చేస్తున్నాను. ఆలోచించు. నాన్నకొచ్చే జీతంతో మనం బతకలేమని నేననను. కొన్ని కంఫర్ట్స్ వదులుకుంటాం అంతే కదా? ఉన్నంతలోనే సర్దుకుని బతుకుదామని నువ్వంటే నేనిక ఇంట్లో ఉంటాను. కాదూ, అర్థం చేసుకుని కోపరేట్ చేస్తానంటే .... నీకిష్టమైతే నేను మళ్ళీ జాబ్‌లో చేరతాను' చెప్పేసి రోహిణి అక్కడినుంచి వెళ్ళిపోయింది. కూతురు పంతంగా నువ్వుజాబ్ చెయ్యద్దమ్మా అంటే ఏం చేయాలో ఆమెకే తెలీడం లేదు. గోటితో పోయే విషయాన్ని గొడ్డలిదాకా తెచ్చామేమో అనిపిస్తోంది.

'అది కష్టంసుఖం గ్రహించే పిల్లయితే నీకు పాజిటివ్ రిప్లై ఇస్తుంది. అలా కాకపోతే దాని మాట లెక్కపెట్టాల్సిన అవసరం లేదు' అనేసాడు మూర్తి.

★★★

స్వప్న బర్త్‌డే అని అందర్నీ పిక్చర్‌కి తీసుకువెళ్ళింది. అంతా లాంగ్‌టర్మ్ కోచింగ్‌కి ఫీజు కట్టిన వాళ్ళు. వెళ్ళాలంటే అవమానంగా అనిపించింది శృతికి. అందులోను తనకి తండ్రి గుమాస్తా సంబంధం చూసాడని తెలిస్తే ఎలా వుంటుంది? వాస్తవానికి అందర్లోకీ తనే బ్రైట్. అలాంటిది సామాన్యంగా గడపాల్సి రావడం... తల్లికి తనేం జవాబివ్వాలి? అయినా స్వప్న బాధపడుతుందని వెళ్ళింది.

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాక కేజువల్‌గా తలతిప్పి చూసిన నమ్రత చివాల్న లేచి నిలబడింది. ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది. పెదాలు చిన్నగా కంపిస్తున్నాయి. ఒక్క క్షణం శృతికేం అర్థం కాలేదు. ఉన్నట్టుండి నమ్రతలో అంత మార్పు ఎందుకొచ్చిందో... ఆ తర్వాతి క్షణంలో ఆ దృశ్యాన్ని తనే చూసింది. తమకి రెండు లైన్ల కింద నమ్రత తండ్రి... పక్కన మరో స్త్రీ... ఆమెతో కులాసాగా మాట్లాడుతున్నాడు. తెల్లబోయింది శృతి. అప్పటికే నమ్రత, స్వప్న... ఒక్కొక్కరే బైటికిపోయారు. కరుణ శృతిని లాక్కెళ్ళిపోయింది.

'సారీ స్వప్నా! ప్లెజెంట్ ఈవెనింగ్‌ని స్పాయిల్ చేసాను.' బేలన్స్‌డ్‌గా వుండేందుకు ప్రయత్నిస్తూ స్వప్నకి చెప్పింది నమ్రత.

'టేకిట్ ఈజీ!' నమ్రత మంజేతిమీద తట్టుతూ వోదార్పుగా చెప్పింది స్వప్న. అందరికీ ఇలాంటి సంఘటన కొత్త. అందులో సగం మంది నమ్రతని లక్కీ అనుకుంటున్నారు. అలాంటి

నమ్రతకి ఇలాంటి తండ్రి? దిగ్భ్రమగా వుంది.

శృతి ఎక్కాక నమ్రత మోటర్‌బైక్ స్టార్ట్ చేసింది. సగం దూరం వెళ్లాక సడన్‌గా ఆపింది. శృతి ఆశ్చర్యంగా చూసి, "ఎందుకే ఇక్కడ ఆపావు?" అనడిగింది.

'చెప్తాను. దాబాలో కూర్చుందాం పద' అని లాక్కెళ్లింది.

'నన్ను మీరంతా లక్కీగర్ల్ అని క్రౌన్ చేసారు. చూసావుగా నా లక్కెంతో? మరి నీ ప్రాబ్లమేంటే? ఎందుకు డల్‌గా వుంటున్నావు? ఫీజెందుకు కట్టలేదు?' అడిగింది.

శృతి తలొంచుకుంది.

'మాకు డబ్బుంది. కానీ మా నాన్న మాకిలా నరకం చూపిస్తూ వుంటాడు. ఐనా నేను లక్కీ అనే అనుకుంటాను. ఎందుకో తెలుసా? ఈ బాధంతా తనొక్కదానిదేననీ, దాంతో మీకెలాంటి సంబంధం లేదని మమ్మల్ని నమ్మించి వోదార్చే అమ్మ వున్నందుకు మళ్లీ మా అమ్మే ఏమంటుందో తెలుసా?"

శృతి విస్మయంగా తలెత్తి చూసింది.

'అమ్మలు ఉద్యోగం చెయ్యక్కర్లేదని ఒకళ్లతో ఒకళ్లు పోటీపడి చెప్పేసారు ఆ రోజు. అప్పుడే అనుకున్నాను ఆంటీని హర్ట్ చేస్తున్నామని. ఒక్క విషయం శృతీ! నన్ను, నిన్ను కంపేర్ చేసుకుందాం. నీకోసం ఏదేనా చెయ్యగలిగే అమ్మ వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే నీ భవిష్యత్తంతా ఆవిడ చేతుల్లో ఉంది. నాలాంటి పరిస్థితి నీకు ఎదురైతే ఇలా అవమానాన్ని దిగమింగుకునే పరిస్థితి రానివ్వదు. కాని మా అమ్మకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. అది లేనప్పుడు ఇంకెన్ని వుంటేనేం?' సూటిగా అంది నమ్రత.

'వెళ్లు. ఆంటీకి సారీ చెప్పేయ్. నూటికి తొంభై తొమ్మిది మందికి ఏవో ప్రాబ్లమ్స్ వుంటాయ. మిగిలిన వాళ్లలో సగం మందికి ఏ ప్రాబ్లమ్సూ వుండవు. నువ్వు ఈ రెండు కేటగిరీస్‌లోకి రావు. ఏవో ప్రాబ్లమ్సున్నాయనుకునే పాయింట్ ఫైవ్‌లో నువ్వుంటావు.'

నిజమే! తల్లీ తండ్రీ ఎప్పుడే అనేట్టు తనకి మెచ్యూరిటీ రాలేదు. చిన్నపిల్లలా ప్రవర్తిస్తూ వాళ్లకి ప్రాబ్లమ్స్ క్రియేట్ చేస్తోంది. తన వయసుదే అయిన నమ్రత తనకన్నా ఎంతో పెద్దదాన్లా మాట్లాడుతోంది. ఇద్దర్లోకీ తనే లక్కీ. ఎందుకంటే తన బాల్యం. అమాయకత్వం ఎంతో జాగ్రత్తగా పరిరక్షింపబడినందుకు.

తను నిజంగానే లక్కీ, ప్రపంచంలోని ఏ చెడూ తమ వాకిలి తట్టనందుకు. తను అంతకన్నా లక్కీ తల్లీతండ్రీ తననో వ్యక్తిగా కూడా గుర్తించినందుకు.

అపరాధ భావనతో శృతి గొంతు మూగవోయింది. మౌనంగా లేచి నిలబడింది. అమ్మ ఒళ్ళో వాలిపోయి మనసులోని బరువునంతా దించేసుకుందామని ఆత్రుతగా ఉంది. ఇంకెప్పుడూ అమ్మని ఏ విధంగానూ కష్టపెట్టకూడదని మనసులో గట్టిగా నిర్ణయించుకుంది.